# కథకాని కథ

నెంబర్ 'త్రీ' బస్‌కోసం ఎదురుచూస్తూ శంకరమఠం దగ్గర నిలబడ్డాను.

అలా అక్కడ నిలబడి బస్‌కోసం ఎదురుచూట్టం ప్రారంభించి అప్పటికి ఇరవై నిముషాలు దాటిపోయింది. బస్సులు వస్తున్నై, పోతున్నై. కానీ వాటిలో మూడోనెంబరు మాత్రం వుండటంలేదు. వెళ్తే ఒకదానివెంటే మరొకటి రెండో, మూడో వెళ్తాయి! లేకపోతే ఏ అరగంటదాకానో ఒక్క బస్సూ వుండదు!

ఆ రోజు ఆదివారం కావడంవల్ల మారేడ్‌పల్లిలో వున్న మా పెద నాన్నా వాళ్ళింటికి వెళ్దామని బయల్దేరాను.

ఉద్యోగరీత్యా నేను హైద్రాబాద్ వచ్చి హోటల్ భోజనం, రూమ్ నిద్ర ప్రారంభించి రెణ్ణెల్లు దాటుతోంది. అయినా ఇంతవరకూ పెద్ద చెప్పుకోతగ్గ పరిచయాలేమీ ఏర్పడలేదు. బంధువులు కూడా ఈ జంట నగరాల్లో మా పెదనాన్నావాళ్ళు తప్ప మరెవ్వరూ లేరు. మా పెదనాన్నకి కొడుకుల్లేరు! ముగ్గురూ కూతుళ్ళే! అందరూ చాలా సరదాగా వుంటారు. వాళ్ళింటికెళ్తే మంచి కాలక్షేపం. అందుకని ఆఫీసుకి శలవొచ్చిందంటే, ఉదయం భోంచేయగానే వాళ్ళింటికి వెళ్తాను.

మాలతీలత మా పెదనాన్న పెద్ద కూతురు. అది చాలా బాగా పాడుతుంది. కాసేపు దాని పాటలు వినడం, తర్వాత అందరంకల్సి

బుర్లు చెప్పుకోవడం, ఇంకా టైముంటే అలా బయటి కెక్కడికైనా షికారు కెళ్ళడం. ఇలా చాలా సర్దాగా గడిచిపోతుంది. రాత్రి భోజనాలు కాగానే తిరిగి రూమ్‌కి బయల్దేరతాను. రొటీన్ లైఫ్ మధ్య అదో పెద్ద రిలీఫ్!

విసుగ్గా వాచీ వంక చూసుకున్నాను.

పన్నెండుంబావ్!

ఎక్కడా బస్సొస్తున్న జాడలేదు.

ఎండ నిప్పులు చెరుగుతోంది.

వేడిగాలి సుళ్ళు తిరుగుతోంది.

చెమటతో లోపలి బనీను, చొక్కా చాలా భాగం తడిసిపోయింది.

చిరాకేస్తోంది!

ఒక్కక్షణం – 'ఆటోలో వెళ్ళిపోతే?' అన్పించింది. కానీ ఇంత సేపూ వెయిట్ చేసి ఆటోలో ఎక్కగానే వెనకే బస్సొస్తే, ప్రాణం వుసూరు మంటుంది. అందుకని ఆ ప్రయత్నాన్ని విరమించుకొని బస్‌కోసం వెయిట్ చేస్తూ నించున్నాను. రకరకాల ఆలోచన్లు ఈగల్లా మనసుని ముసర సాగాయి.

లత, పద్మ, జయ, పెదనాన్న, అమ్మ - అంతా ఇంకా ఎందుకు రాలేదోనని ఎదురుచూస్తుంటారు. అసలు పెదనాన్నకి నేనిలా రూమ్ తీసుకుని ఒంటరిగా వుండటం ఇష్టంలేదు. 'వచ్చేసి మాతోపాటే వుండరా!' అంటాడు.

'నువ్వు డబ్బులిస్తే వాడు తీసుకోడు. ఏమీ ఇవ్వకుండా ఎన్నాళ్ళని అక్కడుంటావ్?' అంటారు నాన్నగారు.

అందుకనే, ముందు ఓ వారం రోజులు వాళ్ళింట్లో వున్నా, తర్వాత ఓ రూమ్ చూసుకుని నల్లకుంట వచ్చేశాను.

"ఎక్స్‌క్యూజ్ మి!" పలకరింపుతో ఆలోచనల్లోంచి బయటపడి పక్కకి చూశాను.

బహుశా అతనికీ నా వయసే వుంటుంది. ఇరవై నాలుగేళ్ళుండొచ్చు! పెరిగిన గడ్డం, నలిగిన గుడ్డలు, మొహంలోని దైన్యం - అతని స్థితిని చెప్పకనే చెప్తున్నాయ్!

"మీరు వేరేగా అనుకోకపోతే...." నసిగాడు.

ఏదో చెప్పాలనుకున్నట్లుంది. చెప్పడాన్కి తటపటాయిస్తున్నాడు.

అతన్ని చూస్తుంటే అతని పరిస్థితి అర్థమవుతూనే వుంది. ఆర్థిక సహాయం కోసం వచ్చుంటాడు. కాకపోతే అతన్లో మరుగుపడిపోతున్న సంస్కారం తాలూకు మొహమాటం అడ్డు పడుతున్నట్లుంది. అందుకనే అడగలేకపోతున్నాడు. అతని అవస్థ చూస్తుంటే బాధేసింది.

"పర్లేదు చెప్పండి" అన్నాను.

"మాది తెనాలి. అక్కడే బి.యస్.సి. చదువుకున్నాను. చదువు కోవడమైతే నావల్లయింది కాని, ఉద్యోగం సంపాదించడం నా వల్ల కాలేదు. రోజులు సంవత్సరాలుగా మారిపోతున్నాయి. రోజుల్తోపాటు అందరికీ-చివరికి మా ఇంట్లోవాళ్ళక్కూడా నా మీద అభిమానం పూర్తిగా కరిగిపోయి, అసహ్యం చోటు చేసుకోసాగింది. నన్ను, నా బాధని అర్థం చేసుకునేవాళ్ళే కరువయ్యారు. అందరూ సూటిపోటి మాట లనడం ప్రారంభించారు. ఇక అక్కడుండలేక కట్టుబట్టల్తో, సర్టిఫికెట్లతో ఇక్కడికి వచ్చేశాను. ఏదైనా ఉద్యోగం దొరికి, నా కాళ్ళ మీద నిలబడ్డప్పుడే తిరిగి వెళ్ళాలనుకున్నాను. ఆత్మాభిమానంతో వచ్చేయడమైతే వచ్చేశానుగాని, ఇక్కడా నాకుద్యోగం దొరికే ప్రాప్తం కన్పించడంలేదు. మూడు రోజుల్నించీ కన్పించిన ప్రతి ఆఫీసుకి వెళ్తూనే వున్నాను. కానీ ఫలితం శూన్యం." వో నిట్టూర్పు విడిచి తిరిగి చెప్పడం ప్రారంభించాడు:

''ఫోంచేసి రెండు రోజులైంది. నీరసంగా వుంది ప్లీజ్! నన్నర్థం చేసుకుని ఏదైనా సహాయం చేయండి.''కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకున్నాడు.

అతన్నలా చూస్తుంటే విపరీతమైన బాధేసింది.

వో అర్ధరూపాయి అతనికిద్దామనిపించి జేబులోకి చెయ్యిపోనిచ్చాను.

అతను ఆశగా నా వంకే చూస్తున్నాడు.

'పాపం! అన్నం తిని రెండురోజు లైందిట. నే నర్ధరూపాయిస్తే మాత్రం లాభమేంటి?అతను తింటానికేదైనా ఇప్పిస్తే బావుం'డనిపించింది.

''నాతో రండి.'' అతన్తో అంటూ ఎదురుగా వున్న స్వీట్‌షాపువేపు దాగితీశాను. అతను నా వెంటే వచ్చాడు.

రెండు రకాల స్వీట్లు తెప్పించాను.

అతను ఆవురావురంటూ తినేశాడు.

పాలు తెప్పించాను.

అతను పాలను త్రాగుతుండగా 'త్రీ' వచ్చింది.

''మీరు నెమ్మదిగా తాగి వెళ్ళిపోండి. నేను బిల్లు చెల్లించి వెళ్తన్నాను'' గబగబా కౌంటర్ దగ్గరికెళ్ళి బిల్లు చెల్లించి బస్‌కేసి పరుగెత్తాను.

నేను వెళ్ళేసరికి బస్ వెళ్ళిపోయింది.

దాదాపు - అరగంటనించీ బస్‌కోసం వెయిట్ చేస్తున్నాను. తీరా బస్సొచ్చినా అందుకోలేకపోయాను. తర్వాతి బస్ మళ్ళీ ఎంతసేపటి కొస్తుందో!

ఆ ఎండలో అక్కడ నిలబడలేక తిరిగి స్వీట్‌షాపు దగ్గరకొచ్చాను.

అప్పుడే అతడు బయటకొచ్చాడు.

''దాదాపు అరగంటనించీ బస్‌కోసం వెయిట్ చేస్తున్నాను. చివరికి వచ్చింది కాని మిస్సయ్యాను'' అన్నానతన్తో.

''మంచి శాస్తే జరిగించి!'' అన్నాడతను నవ్వుతూ.

అతని నవ్వులో ఓ విధమైన ద్వేషం కనిపించింది. ఆశ్చర్యంగా **అతనివేపు** చూశాను.

''లేకపోతే ఏమిటి? నేను నా గొడవంతా చెప్పుకొని, ఆకలిగా వుందని ప్రాధేయపడితే, మీకు నా మీద ఏమాత్రం నమ్మకం కలగలేదు. అందుకే నాకు డబ్బు లియ్యకుండా మీరే తీసుకెళ్ళి తినిపించారు. ఎదుటి మనుష్యుల్ని సరిగా అర్థం చేసుకోని మీలాంటివాళ్ళకిలాగే జరుగుతుంది'' అనేసి చరచరా వెళ్ళిపోయాడతను.

మరో మూడోనెంబరు బస్సు నా ముందు వచ్చి వెళ్ళిపోయినా కదలకుండా అక్కడే నిలబడిపోయాను.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక)